
కోనసీమ అందాలు..


కడియం నర్సరీలు


కోర్డెలియా షిప్ క్రూయిజ్

ప్రగతి పేరిక..

విశాల సముద్ర తీరం.. పోర్టులు.. నర్సరీలు.. కొబ్బరి.. అరటి.. పామాయిల్.. పౌల్ట్రీ.. గ్యాస్ నిక్షేపాలు.. అబ్బురపరిచే పర్యాటక అందాలు.. ఇలా ఒకటేంటి ఉమ్మడి తూ.గో. జిల్లాలో అపార వనరులు ఎన్నో.. వీటిని మరింత సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిలో ఆకాశమంత ఎత్తుకు ఎదగడానికి ఎన్నో అవకాశాలున్నాయి. తద్వారా ప్రజల ఆదాయం అమాంతం పెంచి అభివృద్ధి పథంలో నడిపించేందుకు మార్గాలున్నాయి. ఇప్పుడు సీఎం చంద్రబాబు దీనిపైనే దృష్టిసారించారు. కొత్తగా విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను సృష్టించి అందులో ఉమ్మడి తూ.గో.ని చేర్చారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వేటికవే ప్రత్యేకతలున్నందున ఆయా అంశాల్లో ఈ మూడు జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక విజన్ ప్లాన్ తయారుచేశారు. 2032 నాటికి ఈ మూడు జిల్లాల్లో సమూల మార్పులు వచ్చేలా ప్రణాళికలు తయారు చేశారు.

అభివృద్ధి సూచిక!

- విశాఖ ఎకనమిక్ రీజియన్ విజన్ ప్రణాళికలో ఉమ్మడి జిల్లాకు పట్టం
- కాకినాడ, కోనసీమ, తూ.గో. జిల్లాల్లో భారీ అభివృద్ధి ప్రణాళికలు
- కాకినాడలో 2 వేల ఎకరాల్లో ఆక్వా పార్కు.. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి రెట్టింపు
- కడియం నర్సరీలను దేశ నర్సరీ రాజధానిగా మార్చేలా ప్రతిపాదనలు
- 2 వేల ఎకరాల్లో పాలీహౌస్‌లు, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్
- సినిమా షూటింగ్‌లు, రివర్ క్రూయిజ్‌లను ప్రోత్సహిస్తే కోనసీమకు మహర్దశ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ.. ప్రగతి జాడ..

7.4 బిలియన్ డాలర్ల జీడీడీపీతో 2.2 మిలియన్ జనాభా ఉన్న కాకినాడ జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీరం.. ఓడరేవు, పరిశ్రమలకు నెలవు. ఈ జిల్లాను ఆయా రంగాల్లో మరింత ఎత్తుకు తీసుకువెళ్లేలా విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలో ప్రస్తావించారు. ఇందులోభాగంగా 200ఎకరాల్లో తీర ప్రాంతంలో ప్రభుత్వం ఆక్వా పార్కును ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే ఇక్కడ త్వరలో 1 ఎంఎంటీపీఏ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. అలాగే 2 గిగావాట్ల ఎలక్ట్రొలైజర్ ఉత్పత్తి చేయబోతున్నారు. తద్వారా కాకినాడ అభివృద్ధి చెందడంతోపాటు ఇక్కడ తయారయ్యే గ్రీన్ అమ్మోనియాలో 0.25 మిలియన్ మెట్రిక్ టన్నులు విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఇక్కడున్న కేజీ బేసిన్ దేశంలో 35 శాతం గ్యాస్ అవసరాలు తీర్చుతోంది. లక్షల కోట్లు టర్నోవర్ జరిగే బేసిన్‌లో మున్ముందు గ్యాస్, చమురు అన్వేషణ పెంచి కొత్త బ్లాక్‌లు తవ్విస్తే రీజియన్ ఆర్థికంగా మరింత బలోపేతమవుతుంది. అలాగే కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు గ్యాస్ పైపులైన్ నిర్మాణం ఇప్పటికీ జరగలేదు. 20-30 ఎంఎంఎస్‌సీఎంఈ సామర్థ్యంతో దీన్ని వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు. ఇందుకు 100 నుంచి 150 మిలియన్ డాలర్లు అవసరమని అంచనా. తద్వారా ఇంటింటి గ్యాస్ అవసరాలను రీజియన్ మొత్తానికి తీర్చవచ్చు. అలాగే కాకినాడలో ప్రత్యేక గ్యాస్ టెర్మినల్ నిర్మించాలని ప్రతిపాదించింది. 20-30 ఎంఎంఎస్‌సీఎండీ సామర్థ్యంతో 2028-2030కి దీన్ని పూర్తి చేయాలని పేర్కొంది. ఈ రీగ్యాసిఫికేషన్ యూనిట్‌కు 900 మిలియన్ నుంచి 1 బిలియన్ ప్రైవేటు పెట్టుబడులు అవసరమని పేర్కొంది. అలాగే ప్రస్తుతం కాకినాడ డీప్‌వాటర్ పోర్టు 26 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో (ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో పనిచేస్తోందని, 2032 నాటికి 63 ఎంఎంటీపీఏకు సామర్థ్యం పెంచాలని పేర్కొంది. అలాగే ఇక్కడున్న ప్రభుత్వ యాంకరేజ్ పోర్టు సామర్థ్యం 4 నుంచి 5కి, రాబోతున్న గేట్‌వే పోర్టు సామర్థ్యం 16 ఎంఎంటీపీఏకు పెంచాల్సి ఉందని గుర్తించింది. అలాగే కాకినాడలో నౌకల తయారీ రంగం అంతంత మాత్రంగానే ఉందని నివేదిక పేర్కొంది. ఓ ప్రైవేటు యార్డు ద్వారా ఏటా 4 వేల నుంచి 5వేల గ్రాస్ టన్నుల తయారీ జరుగుతోందని, వసతులు పెంచి అదనంగా పది వేల గ్రాస్ టన్నుల తయారీ పెంచాలని ప్రతిపాదించింది. అలాగే జిల్లాలో ప్రైవేటు రంగంలో 5,600 ఎకరాల్లో మల్టీప్రొడక్ట్ పార్క్ ఏర్పాటుచేయాలని ప్రణాళిక సిద్ధంచేసింది. బుద్ధిస్ట్, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పరుగులు తీసేలా పలు సూచనలు చేసింది. ఏటా అన్నవరం దేవాలయానికి 1 మిలియన్, ద్రాక్షారామ 0.2 మిలియన్, పిఠాపురం 0.1 మిలియన్ భక్తులు వస్తున్నారని, ఇది భారీగా పెరిగేలా సన్నద్ధం చేయాలని పేర్కొంది. భవిష్యత్తు అవసరాల్లో భాగంగా పారిశ్రామిక రంగంలో పనిచేసే వారి అవసరాలకు 1,500 ఎకరాల్లో క్లీన్ టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ ప్రతిపాదించారు. అలాగే కాకినాడ-మూలపేట బైపాస్ రోడ్డు, విశాఖ-కాకినాడ 125 కి.మీ. కోస్టల్ రోడ్డు ద్వారా అన్ని పోర్టులకు అనుసంధానం పెంచి కార్గో రవాణా భారీగా పెంచాలని వ్యూహం రచించారు.

తూ.గో.. నర్సరీల రాజధానిగా..

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో అత్యధిక జీవీఏ ఉత్పత్తితో తూర్పుగోదావరి జిల్లా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరానికి గాను 2.4 బిలియన్ జీవీఏ నమోదుచేసింది. కాకినాడ జిల్లా 2.2 బిలియన్, కోనసీమ 1.9 బిలియన్‌గా ఉంది. వార్షిక జీడీడీపీ 6.8 బిలియన్లతో రెండు మిలియన్ల జనాభా ఉన్న ఈ జిల్లా గుడ్లు, నర్సరీ కేంద్రంగా కొనసాగుతున్నట్టు నివేదిక గుర్తించింది. భవిష్యత్తులో ఇక్కడ ఐసీఏఆర్ లేదా సీఏఆర్ఐ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. కోళ్ల రకరకాల వ్యాధులు తట్టుకునేలా ఈ పరిశోధన కేంద్రం అడుగులు వేయాలని సూచించింది. అలాగే క్రూడ్ పామాయిల్ ఉత్పత్తిలో ఈ జిల్లా 15 శాతం, కాకినాడ 9 శాతంతో టాప్‌లో ఉన్నాయని వివరించింది. భవిష్యత్తులో ఈ ఉత్పత్తి పెరిగితే మరింత ఆదాయం వస్తుందని సూచించింది. అరటి ఉత్పత్తి కూడా ఈ జిల్లాలో అధికంగా ఉన్న నేపథ్యంలో కొవ్వూరులో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. నర్సరీ సాగులో ఈ జిల్లా లీడర్‌గా ఉందని దేశ నర్సరీల రంగానికి ఈ ప్రాంతం రాజధాని కానుందని విశ్లేషించింది. 5,500 హెక్టార్లలో సాగవుతున్న నర్సరీల ద్వారా ఏటా 100 మిలియన్ డాలర్ల జీవీఏ వస్తుండగా, 50వేల మందికి ఉపాధి లభిస్తోంది. కానీ ఎగుమతులు 2 శాతం లోపే ఉన్నాయని, 2032 నాటికి ఎగుమతులు 15 శాతం పెంచడానికి ఆస్కారం ఉందని తెలిపింది. ఆర్నమెంటల్, అవెన్యూ మొక్కల ఎగుమతికి ఆస్కారం ఉందని తెలిపింది. నర్సరీల్లో ఆధునిక పద్ధతులు వాడి జీవీఏను 2032 నాటికి 200 మిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొంది. అంటే సాగు 40 శాతం పెరగాలని తెలిపింది. 15 శాతం ఎగుమతులు పెంచితే 120మిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని విజన్ ప్రణాళికలో తెలిపింది. ఇందుకోసం 2వేల ఎకరాల్లో నర్సరీ జోన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదించింది. పాలీహౌస్‌లు, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్‌తోపాటు శీతల గిడ్డంగుల వసతి కల్పించాల్సి ఉందని తెలిపింది. అలాగే పర్యాటక రంగం మరింత ఎదగడానికి ఈ జిల్లాకు చాలా అవకాశాలున్నాయని, పర్యాటకుల కోసం 6 నుంచి 12 గంటల వ్యవధిలో లాంగ్ హాప్-ఆన్ హాప్-ఆఫ్ రివర్ క్రూయిజ్ పర్యాటకం ప్రోత్సహించాలని పేర్కొంది. రాజమండ్రి-భద్రాచలం, కాకినాడ-దిండి మార్గాల్లో టర్కీ మోడల్ క్రూయిజ్ నడపాలని ప్రతిపాదించింది. భద్రాచలం-రాజమండ్రి లోకల్ సైట్ సీయింగ్, కాకినాడ-దిండి బ్యాక్ వాటర్ లీజర్ క్రూయిజ్‌లు నడపాలని సూచించింది. అలాగే భవిష్యత్తులో ద్రాక్షారామ, పిఠాపురంలో 250 చొప్పున హోటల్ గదులు, అన్నవరం 500 గదులు రావాలని ప్రతిపాదించింది. ఏటా జూలైలో గోదావరి యాత్ర ఏడు రోజులు, నవంబరులో ఏడు రోజులు కాకినాడ బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని తెలిపింది.


కొబ్బరి కేంద్రం.. కోనసీమ

కొబ్బరి పంటకు కేంద్రంగా కోనసీమ జిల్లా ఉందని నివేదికలో నీతిఆయోగ్ వెల్లడించింది. 5.1 బిలియన్ జీడీడీపీతో 1.8మిలియన్ జనాభా ఉన్న జిల్లా ప్రకృతి అందాలకు, గోదావరి, సముద్రం బ్యాక్ వాటర్స్‌కు పెట్టింది పేరని తెలిపింది. ఈ నేపథ్యంలో సినిమా చిత్రీకరణలకు రాజధానిగా జిల్లాను మార్చాలని ప్రతిపాదించింది. సముద్రంలో నాచు పెంపకంతో ఇక్కడ భారీగా ఆదాయం రాబట్టవచ్చని తెలిపింది. కోనసీమలో కోకోనట్ రీసెర్చ్ స్టేషన్ సామర్థ్యం పెంచాలని సూచించింది.

పెట్టుబడులతో రండి!

- కాకినాడలో నాఫ్తాకాంప్లెక్స్, పాలిమర్స్ యూనిట్ ఏర్పాటు చేయండి
- ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చించిన సీఎం
- షిప్ క్రూయిజ్ సర్వీసులపై కోర్డెలియాతో సంప్రదింపులు

కాకినాడలో నాఫ్తా కాంప్లెక్స్, పాలిమర్స్ కంపెనీ ఏర్పాటుచేయడానికి ముందుకు రావాలని ఎల్‌జీ కెమికల్స్ కంపెనీని సీఎం చంద్రబాబు కోరారు. రెండో రోజు విశాఖలో పెట్టుబడుల సదస్సులో భాగంగా సీఎం ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చలు జరిపారు. యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఈ రెండింటిని ఏర్పాటు చేసే విషయమై పరిశీలించాలని కోరారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే అందుకు తగ్గ సహాయసహకారాలు అందిస్తామని వివరించారు. జేఎస్‌డబ్ల్యూ కంపెనీతో కలిసి ఎల్జీ కెమికల్ సంస్థ ఏర్పాటు చేయదలచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు సైతం సహకారం అందిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి అనేక రకాల పరిశ్రమలు నిర్వహించడానికి ఇంధనంగా గ్యాస్ అవసరం. అది అందుబాటులో లేనప్పుడు నాఫ్తాతోను పరిశ్రమలను నడిపించవచ్చు. ఒకవేళ ఎల్‌జీ కంపెనీ నాఫ్తా కాంప్లెక్స్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందిస్తే రూ.60వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా. కొరియా దేశానికి చెందిన ఎల్‌జీ కెమికల్స్‌కు పలు దేశాల్లో ఇప్పటికే నాఫ్తా కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మరోపక్క దేశంలో ముంబై, గోవా తదితర ప్రాంతాల్లో సముద్రంలో షిప్ క్రూయిజ్ నిర్వహణలో ప్రఖ్యాతి గాంచిన కోర్డెలియా క్రూయిజ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చర్చలు జరిపారు. కాకినాడ నుంచి విశాఖ-భీమిలికి షిప్ క్రూయిజ్ సర్వీసులు నడపడానికి కలిసిరావాలని కోరారు. కాకినాడ, విశాఖల్లో క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వెంచర్ క్రీడల నిర్వహణపై ఆసక్తి చూపుతోంది.



విషాద వీచికలు!

నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

సాఫీగా సాగిపోయే ప్రయాణంలో పెనుతుఫాన్.. రోడ్డు ప్రమాదం. రెప్పపాటులో జరిగిపోయే ఈ ఘోరం.. క్షణాల్లో కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది. ఏదైనా ప్రమాదంలో ఇంటి యజమానిని కోల్పోతే.. ఆ కుటుంబమే చీకట్లోకి చేజారిపోతుంది. ఆర్థికంగా నిట్టనిలువునా చితికిపోతుంది. కొన్నాళ్లకు.. కూడదీసుకుని నిలబడొచ్చు.. లేదా మరింత అంధకారంలోకి దిగబడిపోవచ్చు. లేదా కుటుంబంలో వేరెవరైనా మరణించినా జీవితాంతం వారు లేని వ్యథ వెంటాడుతుంది. కాలం వారిని జీవచ్ఛవాల్లా మార్చేస్తుంది. ఈరోజు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం. ప్రమాదంలో మరణించిన వారి కన్నీటి కథల్లో ఇవి కొన్ని.. 7

తాళం వేసున్నా దోచేస్తారు..

7

దొంగతనాలు చేస్తున్న ముగ్గురిని పట్టుకున్న కాకినాడ పోలీసులు

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

7

నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల వనసమారాధన

- శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్‌కు రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి సుభాష్ 7

శబరిమలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు


జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపోనుంచి శబరిమలకు రెండు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సులను కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులు శ్రీశైలం మహానంది, కాణిపాకం, అరుణాచలం, పళని, ఎరిమేలి, పంబ చేరుకుని తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి, త్రివేండ్రం, రామేశ్వరం, మధుర, శ్రీరంగం, కంచి, తిరుపతి, కాళహస్తి, విజయవాడ దర్శనానంతరం 25న కాకినాడ చేరుకుంటాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.ధర్మారావు, పీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు పాల్గొన్నారు.

ఏడాది పాటు రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకలు

- 17న ఐదు కిలోమీటర్ల పాదయాత్ర.. పెద్దఎత్తున యువత పాల్గొనాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి):సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకలను 2025, అక్టోబరు నుంచి 2026, అక్టోబరు వరకు సంవత్సరంపాటు కాకినాడ జిల్లాలో నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలోభాగంగా 15-29 ఏళ్ల యువతలను భాగస్వామ్యం చేస్తూ ఈనెల 17న ఐదు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు కాకినాడ భానుగుడి సెంటరునుంచి ఈ పాదయాత్ర ప్రారంభవుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు సాంబమూర్తినగర్‌లో ఉన్న ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల వరకు నిర్వహి స్తామన్నారు. పాదయాత్ర సజావుగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు అవసరమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చేయాలన్నారు. పాదయాత్రలో యువతకు ఇబ్బందులు కలగకుండా వైద్యసదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. దేశ సమైక్యతను చాటుతూ పాదయాత్రలో పెద్దఎత్తున యువత పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతులకు ఆరబోత కష్టాలు!


గొల్లప్రోలులో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని లేఅవుట్‌లో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

పంట చేతికందే సమయానికి రైతులకు ఆరబోత కష్టాలు తప్పడం లేదు. వాతావరణంలో జరిగిన మార్పులతో వరి కోత యంత్రాల ద్వారా రైతులు మాసూళ్లు పూర్తి చేస్తున్నారు. ఇలా వచ్చిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటోంది. దీని కోసం ధాన్యాన్ని నాలుగైదు రోజులపాటు ఆరబోసి ఆపై విక్రయిస్తున్నారు. ఆరబోతకు స్థలాలు లేక రహదారులు, లేఅవుట్లలోని ఖాళీ స్థలాల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. గొల్లప్రోలు పట్టణ శివారు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని లేఅవుట్‌లో ఆరబోయగా ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

(ఆంధ్రజ్యోతి-గొల్లప్రోలు)

ఎంఈవోలతో డీఈవో సమీక్షా సమావేశం

కాకినాడరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 21 మండలాల ఎంఈవోలతో కాకినాడ విద్యాశాఖ భవనంలోని సమావేశ హాల్లో డీఈవో పి.రమేష్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎఫ్ఏ2 ఫలితాలు, ఎమ్మార్సీ నిధుల వినియోగం, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, మెగా పీటీఎం, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది హాజరు తదితర అంశాలపై మండలాల్లోని పాఠశాలల్లో అమలు తీరును అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఏసీ ఈ.వెంకట్రావు, ఏపీసీ వేణుగోపాల్, ఏఎంవో జగన్, ఏడీలు వివిధ మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్, పాల్గొన్న డీసీఈబీ వెంకట్రావు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎస్పీ బిందుమాధవ్


ఎస్పీ కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని... కార్యాలయ ప్రదేశాన్ని, శుభ్రంగా, అందంగా ఉంచడం ద్వారా పనితీరు మరింత మెరుగు పడుతుందని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సిబ్బందికి సూచించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో మూడో శనివారం ఎస్పీ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు. పోలీసుకార్యాలయం చుట్టూ ఉన్న పరిసరాలు, ఆవరణ, పార్కింగ్ ప్రదేశాలు, మొక్కలు, చుట్టుపక్కల ప్రాంతాలు, చెత్త కూడలి ప్రాంతాలు తదితర వాటిని శుభ్రపరిచారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్డీపీవో, ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ ఆర్ఐ వెంకట్రావు, ఆర్ఎస్ఐలు, సర్పవరం సీఐ పెద్దిరాజు పాల్గొన్నారు.

వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో..

కాకినాడక్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భా గంగా మూడో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డీఎం అండ్ హెచ్‌వో నరసింహ నాయక్ ఆధ్వర్యంలో 'వ్యక్తిగత సమాజ పరిశుభ్రత' పేరుతో పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు.కీటక జనిత వ్యా ధుల నుంచి రక్షణ పొందడం, ఆరోగ్యంగా ఉండడం, పరిసరాల, వ్యక్తిగత శుభ్రత, నిల్వఉన్న వ్యర్థాలను తొలగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో పారిశుధ్యం, డ్రై డే కార్యక్రమం క్రమం తప్పకుండా కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎల్ఏటీసీవో డాక్టర్ ఎస్.చలమయ్య, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీఎంఓఐసీ డాక్టర్ ఐ.ప్రభాకర్, పీఓ ఆర్‌బీఎస్‌కే డాక్టర్ అరుణ, డీపీఎంవోఎన్‌హెచ్‌ఎం డాక్టర్ జి.లక్ష్మి, ఫైలేరియా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రవి పాల్గొన్నారు.


వైద్యారోగ్యశాఖ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరసింహ నాయక్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

విషాద వీచికలు..



నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

- ఏటా భారీగా రోడ్డు ప్రమాదాలు
- వందల సంఖ్యలో మృతులు.. క్షతగాత్రుల గణాంకాలు
- ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- అనాథలుగా మారుతున్న పిల్లలు
- హైవేలపై భారీగా బ్లాక్ స్పాట్స్
- రహదారులపై భద్రత ప్రశ్నార్థకం

చీకటి తర్వాత వెలుగు వస్తుందనేది ఓ ఆశ. ఈరోజు ముగిస్తే రేపు ఉందనేది ఓ భరోసా. అదేవిధంగా ప్రతి మనిషి జీవితంలో వెలుగునీడలు సర్వసాధారణం. ప్రతి కుటుంబంలో కష్టసుఖాలు అంతే సహజం. అయితే ఆశకు, నిరాశకు మధ్య బలమైన నమ్మకమో, విశ్వాసమో భవిష్యత్‌కు దారి చూపిస్తుంది. అదే అందరికీ ఆలంబన. కానీ.. ఒకే ఒక్క ఘటన.. ఓ కుటుంబం పెంచుకున్న ఆశలను తుంచివేస్తుంది. రేపనేది ఏమిటో అర్థం కాని అంధకారంలోకి నెట్టివేస్తుంది. కొందరి జీవితాల్లో చీకటి తర్వాత మళ్లీ వచ్చేది చీకటే. కళ్ల ముందు ఉన్న ఆప్తులు అర్థాంతరంగా మాయమై పోతే.. దుఃఖం కట్టలు తెంచుకుని ఉప్పెనలా చుట్టేస్తుంది. కానీ కొన్నాళ్లకు దుఃఖాశ్రువులు ఇంకిపోవచ్చుగానీ.. అయినవారిని కోల్పోయిన వారికి ఏళ్ల తరబడి విషాద వీచికలు చిగురుటాకులా వణికిస్తూనే ఉంటాయి. ఇవి రోడ్డు ప్రమాద స్మృతులు.. నిద్రలో ఉలిక్కిపడి లేపే పీడ కలలు..

(కాకినాడ/రాజమహేంద్రవరం/(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలు జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయి. చాలా కుటుంబాలను చిందర వందర చేస్తున్నాయి.అతివేగం, నిర్లక్ష్యం, నిద్రమత్తు, మద్యం సేవించడం..ఇలా కారణం ఏదైనా ఒక్క ప్రమాదంతో అనేకమంది రోడ్డునపడుతున్నారు. చిన్నారులు అనాథలవుతున్నారు.

తాళ్లరేవు మండలంలో ఈ ఏడాది జూలైలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఓ ఆటోను వేగంగా ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందడంతో బాధిత కుటుంబంలో ఇద్దరు బాలలను అనాథలను చేసింది. ఓ కుటుంబానికి పెద్ద దిక్కును లేకుండా చేసింది. ఓ మహిళను లేవలేని జీవచ్ఛవంలా మార్చింది. మంచానికే పరిమితం చేసింది. నాలుగు ఆపరేషన్లు, కాళ్లు, చేతుల్లో స్టీల్ రాడ్‌లతో ఆమె నరకం అనుభవిస్తూ.. నడవలేని స్థితిలో ఆ మహిళ ఉంది. వీరికి ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్‌యాజమాన్యం నుంచికానీ.. ప్రభుత్వంనుంచి గానీ సాయం అందలేదు. అనేక ప్రమాద ఘటనల్లో ఇదే పరిస్థితి.



రంగంపేట మండలం వడిశలేరు వద్ద లారీని వెనుక నుంచి ఢీకొని నుజునుజ్జయిన కారు

కుటుంబాలను చీకట్లోకి నెట్టి..

రోడ్డు ప్రమాదాలు కొందరి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. కొన్ని ప్రమాదాల్లో కుటుంబాలను పోషించే పెద్ద దిక్కులు మృత్యువాత పడడంతో కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. యువకులు సైతం ప్రమాదాలబారిన పడి కుటుంబాలను శోకసంద్రంలో ముంచుతున్నారు. మద్యం మత్తు, నిర్లక్ష్యంతో వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతూ తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగులుస్తున్నారు. జిల్లాలో ప్రతిఏటా వందల సంఖ్యలో యువకులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

● **ప్రమాదాలకు కారణాలివేనా?**

బ్లాక్‌స్పాట్లు గుర్తించిన తర్వాత ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవేస్, విద్యుత్తు, ఆర్టీఏ, మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగాల పాత్ర ఎక్కువ. విద్యుత్తు, రోడ్డు మార్కింగ్‌లు, బోర్డుల ఏర్పాటు ఆ శాఖల పనే. శాఖల మధ్య సమన్వయ లోపం, రక్షణ పనుల్లో అలసత్వంవల్ల బ్లాక్ స్పాట్లు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. వాహనదారులు అతివేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వెళ్లడం, వాహనాలు కండీషనల్‌లో లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

● **ఇలా చేస్తే..**

హైవేలు లేదా రెండు లేన్లు, సింగిల్ లేన్(వరుస) రోడ్లపై వాహదారులకు ఏవి ఎటు వెళ్లాలి.. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించవచ్చు. రాత్రి వేళల్లో వాహనాల డ్రైవర్ల పరిస్థితిని అంచనా వేయాలి.

● **అదుపులేని టిప్పర్లు**

ఇసుక, కంకర, మట్టి రవాణా టిప్పర్లు ప్రమాదకరంగా మారాయి. అధిక లోడ్లతో దూసుకుపోతున్నాయి. క్యాబిన్ మినహా టిప్పర్ మొత్తం సరుకుతో నింపేస్తున్నాయి. దీంతో రోడ్లు కూడా ఛిద్రం అవుతున్నాయి.

● రెండు కుటుంబాల్లో చీకటి



మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు (మృతుల పాతచిత్రం)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని రఘునాథపురానికి చెందిన రేలంగి శివన్నారాయణ(40)కు భార్య దేవి లలిత(34), కుమార్తెలు వేదహర్షిత(13),వర్షిత(13), కొడుకు మహిధర్ సత్యకుమార్. హర్షిత, వర్షిత కవలలు కావడంతో ఆధార్ వేలిముద్రల సమస్య ఏర్పడగా పరిష్కారం నిమిత్తం ఈఏడాది జూన్ 2న కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరి వెంట శివన్నారాయణ బావమర్ది తీగిరెడ్డి శివ(30), శివ సతీమణి భవాని (26), కుమార్తె సాన్వి(4) కూడా ఉన్నారు. వీరంతా రంగంపేట మండలం వడిశలేరు సమీపంలోకి రాగా కారు లారీని వెనుకనుంచి బలంగా ఢీకొంది.ఈ ఘటనలో శివన్నారాయణ, దేవిలలిత, హర్షితలతోపాటు శివ, సాన్వి మరణించారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తల్లిదండ్రులతోపాటు సోదరిని కోల్పోయి వర్షిత, మహిధర్ చెల్లాచెదురయ్యారు.వర్షిత అమ్మమ్మ దగ్గర కవలగొయ్యిలో ఉంటూ 8వతరగతి చదువుతోంది.తాత ఆరోగ్యం బాగోక మంచాన పట్టాడు. మహిధర్ రాజమహేంద్రవరంలో పెద్దమ్మ దగ్గర ఉండి టెన్త్ చదువుతున్నాడు.ఇంకోకుటుంబంలో శివ, అతడి కుమార్తె సాన్వి చనిపోయారు. భార్య భవాని గాయాలతో బయటపడి భర్త,కుమార్తె లేకపోవడంతో మనోవేదనకు గురవుతోంది.



● కుమార్తె, మనువరాలిని కోల్పోయి..



తాళ్లరేవు ప్రమాద ఘటన

(కాకినాడ-ఆంధ్రజ్యోతి): తాళ్లరేవుమండలం పైడా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఈ ఏడాది జూలై 25న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌బస్సు ఓ ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో యానాం కురసాంపేటకు చెందిన ఆటోడ్రైవర్ కూరాకులకుమార్(30), కాకినాడ ఏటిమొగకు చెందిన తల్లీకూతుళ్లు పోతాబత్తుల దుర్గ(55), లంకే భవానీ(35) అక్కడికక్కడే మృతిచెందగా ఓలేటి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ఒకేసారి కుమార్తె, మనువరాలిని కోల్పోయిన దుర్గ తల్లి లంకే ధనలక్ష్మి విలపిస్తోంది. తన మనుమరాలి పిల్లలు ఇద్దరూ అనాథలయ్యారని, ఇదే ప్రమాదంలో గాయపడిన తన చిన్నకుమార్తె లక్ష్మి పూర్తిగా మంచానపడిందని, ఆమెకు నాలుగు ఆపరేషన్లు అయ్యాయని విలపించింది. తమకు ఇప్పటికీ ఎవరూ ఏసాయం అందించలేదని చెప్పింది.



మనువరాలి ఫొటోతో ధనలక్ష్మి

● తల్లిదండ్రులకు శోకం మిగిల్చి..

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం 216 హైవేపై పాతయింజరం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఈ ఏడాది ఫిబ్రవరి 28న యానాం నుంచి స్పోర్ట్స్ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొనగా వారు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ఒకరు ముమ్మిడివరం టెలీఫోన్ ఎక్స్చేంజ్ వీధికి చెందిన దొమ్మేటి జయఅభినవ్(17) కాగా మరొకరు కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని బూరుగుపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి(21). ఒక్కగానొక్క కుమారుడి మృతితో జయఅభినవ్ తల్లిదండ్రులు బాధతో కుంగిపోతున్నారు. మట్టా ఆకాష్‌రెడ్డి(21) వారి కుటుంబంలో పెద్ద కుమారుడు. చేతికి అంది వచ్చిన కుమారుడి మరణంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. ప్రయాణంలో హెల్మెట్ ధరించకే తమ కుమారుడు మృతిచెందాడని, అలా ఎవరూ చేయొద్దని తెలిపారు. అతడిస్నేహితులు ముమ్మిడివరంలో హెల్మెట్‌లు పంచారు.

'కొండంత అండను కోల్పోయాం'

(ఏలేశ్వరం-ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరంలో హైవేపై ఈనెల 8న ఉదయం అన్నవరం నుంచి వస్తున్న పెళ్లికారు బీభత్సం సృష్టించింది. ఆ సెంటర్‌లో ఉన్న ప్రజలను నిద్రమత్తులో డ్రైవర్ వేగంగా వచ్చిఢీకొన్నాడు. ఈఘటనలో స్థానికులు మోర్త ఆనందరావు(65), మోర్త కొండయ్య(30)తోపాటు ఏలేశ్వరానికి చెందిన కాకాడ రాజు(45) మృతి చెందారు. వీరిలో బొప్పాయిలు అమ్ముకునే కాకాడ రాజుకు ఆరుగురు సంతానం. తన తండ్రి కుటుంబానికి కొండంతఅండగా ఉండేవాడని, వయసు మీదపడినా కాయకష్టం చేస్తూ చేదోడుగా ఉండేవాడని, ఆయన దూరం కావడాన్ని తట్టుకోలేకపోతున్నామని కుమారుడు ఏసుబాబు వాపోయాడు.

కాకినాడ జిల్లాలో... 867 ప్రమాదాలు 355 మరణాలు

కాకినాడ జిల్లాలో ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బైక్‌పై వెళ్తున్న వారిని లారీ ఢీకొనడం, నడిచి వెళుతున్న వారిపై నుంచి కారు దూసుకెళ్లడం వంటివి జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో గడిచిన 11 నెలల్లో పలు ప్రమాదాలు అనేకమందిని ఆసుపత్రి పాల్జేశాయి. జనవరిలో 1482 మంది, ఫిబ్రవరిలో 1365 మంది, మార్చిలో 54 మంది, ఏప్రిల్‌లో 20మంది, మేలో 60మంది, జూన్‌లో 88మంది, జూలైలో 117మంది ఆగస్టులో 682 మంది, సెప్టెంబర్‌లో 260 మంది అక్టోబర్‌లో 195 మంది వివిధ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైనట్టు జీజీహెచ్ రికార్డుల్లోని లెక్కలు చెప్తున్నాయి. పోలీసు రికార్డుల ప్రకారం.. జిల్లాలో గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది నవంబర్ మధ్య 867 మేజర్ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 355 మంది మరణించారు. 929 మంది గాయపడ్డారు.

తూర్పు గోదావరిలో.. 636 ప్రమాదాలు 260 మరణాలు

తూర్పుగోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. సరాసరిన నెలకు ఒకరు చొప్పున బలవుతున్నారు. జిల్లాలో గతేడాది 30 బ్లాక్ స్పాట్లు ఉండగా.. ఈ ఏడాది 9 నెలల్లో మరో 3 జత కలిసి మొత్తం 33కి చేరాయి. బ్లాక్ స్పాట్లలోనూ జాగ్రత్తలు శూన్యం అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలోని 636 రోడ్డు ప్రమాదాలు జరగగా ఏకంగా 260 మంది ప్రాణాలు విడిచారు. 679 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆర్టీసీ బస్సుల వల్ల 19, ప్రైవేటు బస్సులు 9, లారీలు 116, ట్రాక్టర్లు 11, కార్లు 148, ద్విచక్ర వాహనాలు 227, ఆటో రిక్షాలు 44, ఇతర వాహనాల వల్ల 62 ప్రమాదాలు జరిగాయి. అయితే ఈ ఏడాది ఒక్క సెప్టెంబరు నెలలోనే నేషనల్ హైవేలో 10. ఇతర రహదారుల్లో 8 మంది ఊపిరి ఆగిపోగా.. 57 మంది గాయాలపాలయ్యారు.

కోనసీమ జిల్లాలో... 300 ప్రమాదాలు 40 మరణాలు

216 జాతీయ రహదారి యానాం నుంచి ప్రారంభమై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సఖినేటిపల్లి వరకు సుమారు 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో గత 10 నెలల వ్యవధిలో 300 ప్రమాదాలు జరగ్గా, 40 మంది మృత్యువాత పడ్డారు. 310 మంది పైగా క్షతగాత్రులయ్యారు. జిల్లాలో గడిచిన రెండేళ్ల పది నెలల్లో 450 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా 1200 మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 590 ప్రమాదాలు జరగ్గా, 210 మంది మృతిచెందగా 442 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 613 ప్రమాదాలు జరగ్గా 153 మంది మృతిచెందగా 402 మంది క్షతగాత్రులయ్యారు. 2025లో ఇప్పటి వరకు 300 ప్రమాదాలు జరగ్గా 40 మంది మృతిచెందగా 300 మంది క్షతగాత్రులైనట్టు సమాచారం.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు



అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

- ఒక్కరోజే సుమారు 12 వేల వ్రతాలు
- లక్ష మార్కు దాటిన సత్యదేవుడి కార్తీకం వ్రతాలు

అన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి సన్నిధికి కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది కార్తీకమాసంలో తొలిసారి 10వేల మార్కుదాటి 11,647 వ్రతాలు ఒక్కరోజే జరగడం విశేషం. దీంతో శనివారంతో సత్యదేవుడి కార్తీకమాస వ్రతాల సంఖ్య 1,15,086కు చేరింది. కార్తీకం ముగియడానికి నాలుగ రోజులు సమయం ఉండగా 1,35,000 జరగవచ్చనని అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. సత్యదేవుడి అంతరాలయ దర్శన టిక్కెట్ల విక్రయాలు పూర్తిగా నిలుపుదల చేశారు. యంత్రాలయ దర్శనం నిలుపుదల చేసి లఘుదర్శనానికి పరిమితం చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం వ్రతాలకు సుమారు 4గంటల సమయం పట్టడంతో ఉపవాసంతో వ్రతం చేసుకున్న భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. చైర్మన్ రోహిత్ పశ్చిమ రాజగోపురం వద్ద లిఫ్ట్ సమీపంలో ఉండి రద్దీని నియంత్రణ చేశారు.మరోపక్క వాహనాల పార్కింగ్‌కు స్థలాభావం ఏర్పడడంతో పోలీసులు కొండ దిగువన మైదానంలో వాహనాలను నిలుపుదల చేశారు.నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా భక్తులకు ఉచిత పులిహోర వితరణ చేశారు. మరో పక్క శనివారం రాత్రికి వివాహాలు ఉండడంతో సత్రం గదుల కేటాయింపు కష్టంగా మారింది.

తుని ఎమ్మెల్యే పూజలు

సత్యదేవుడి సన్నిధిని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబ సభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా చైర్మన్ రోహిత్ వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంటా విష్ణు తదితరులున్నారు.

రాజమండ్రి అభివృద్ధికి కృషి

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన పరిధిలో కృషి చేస్తున్నానని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. త్వరలో జరగబోయే గోదావరి పుష్కరాల పనులపై శాఖలవారీ సమీక్ష చేయాల్సి ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజమండ్రి పెద్ద రైల్వేస్టేషన్‌కు రూ.270 కోట్లు నిధులు తెచ్చామని, పుష్కరాల్లోగా పనులు పూర్తి చేయడానికి వీలుగా ప్లాట్‌ఫారమ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్‌కు ఇరువైపులా అభివృద్ధి పనులు కోసం మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని రైల్వేమంత్రితో మాట్లాడానని అన్నారు. కొవ్వూరులో రెండు రైళ్లకు, అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు తెచ్చామన్నారు. పొగాకు రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకుని వారితో సమావేశమయ్యేందుకు ఈనెల 28, 29 తేదీల్లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఇక్కడకు వస్తున్నారన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద లైట్లు, సర్వీసు రోడ్ల నిర్మాణంపై కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడామన్నారు. మొంథా తుఫాను వల్ల నష్టపోయిన పంటలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనకాపల్లి-దివాన్ చెరువు ఎన్‌హెచ్ 16 ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పార్టీ నాయకులు, ఎప్పటికప్పుడు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల వనసమారాధన

శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్‌కు రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి సుభాష్



అమలాపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఈ నెల 16న ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ నాలుగో కార్తీక వనసమారాధన ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సంఘ పెద్దలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 2లక్షల మంది వనసమారాధనకు హాజరవుతారన్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉభయ రాష్ట్రాల నుంచి 300 బస్సులు, కార్లలో పెద్దసంఖ్యలో సంఘీయులు రానున్నట్టు తెలిపారు. అట్టడుగున ఉన్న సంఘీయులను ఆదుకునేందుకు మంత్రి సుభాష్ రూ.కోటి విరాళం ప్రకటించారని, సోమవారం నాటికి ఎస్ఏఎఫ్ ఖాతాలో ఆ నిధులు జమవుతాయన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, వాసంశెట్టి చినబాబు, రాయుడు సత్యరుషి, దొంగ శ్రీను, గుత్తుల నాగేశ్వరరావు, చొల్లంగి వెంకటరమణ, మామిడిశెట్టి శివరామప్రసాద్ పాల్గొన్నారు.

తాళం వేసున్నా దోచేస్తారు..

- దొంగతనాలు చేస్తున్న ముగ్గురిని పట్టుకున్న కాకినాడ పోలీసులు
- చోరీ సొత్తు కొనుగోలు చేసే మరో ఇద్దరి అరెస్ట్
- రూ.42.60 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



చోరీ సొత్తును పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ

తాళం వేసి ఉన్న ఇళ్లను కొల్లగొడుతూ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పట్టుకోవడంతో పాటు పాటు ఆ చోరీ సామగ్రిని కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.42 లక్షల 60 వేలను కాకినాడ జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఈ వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మీడియాకు వెల్లడించారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలోని కాకినాడ వన్‌టౌన్, త్రీ టౌన్, పోర్ట్, ఇంద్రపాలెం, కరప, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో జరిగిన 7 చోరీ కేసులను ఛేదించి ముగ్గురు నిందితులను, ఇద్దరు రిసీవర్లను అరెస్టు చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు. వారి నుంచి రూ.41 లక్షల విలువైన 331 గ్రాముల బంగారాన్ని, రూ.1.60 లక్షల విలువైన కిలో వెండిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇంద్రపాలెం పోలీసులు సీఆర్ నంబర్ 217/2025 కేసులో సుంకర తేజ, సుంకర అచ్యుత వరప్రసాద్, బండి హరిక అనే నిందితులను శనివారం ఉదయం చీడిగ బ్రిడ్జి వద్ద అరెస్టు చేశారని ఎస్పీ తెలిపారు. అలాగే పోర్టు పోలీసులు సీఆర్‌నంబర్ 134/2025 యు/ఎస్ 331(3), 305(ఏ), బీఎన్ఎస్ కేసులో కర్రి నాని, మోది కార్తీక్‌ను శనివారం ఉదయం పర్లోపేట డంపింగ్‌యార్డు సమీపాన అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. వీరితో పాటు నేరాలకు పాల్పడిన ఇంద్రపాలెం పీఎస్ పరిధిలోని కటకం పద్మరాజు, పోర్టు పీఎస్ పరిధిలోని కర్రి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నారని తెలిపారు.

పాత నేరస్తులు.. ఇళ్లల్లో చోరీలు..

తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, బయట కిటికీల వద్ద, షూ స్టాండుల వద్ద దాచిపెట్టిన తాళాలను వెతికి, వాటితో ఇంటిలోకి ప్రవేశించి, దొంగతనాలు చేయడంలో పాతనేరస్తుడు సుంకర తేజ ఆరితేరాడు. అతడు దొంగిలించిన సొత్తును తనకు అన్న వరసైన సుంకర అచ్యుత వరప్రసాద్, బండి హరికకు అమ్ముతూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నాడు. అలాగే పోర్ట్ పీఎస్ పరిధిలో కర్రి దుర్గాప్రసాద్, కర్రి నాని, మోదీ కార్తీక్ ఇంటికి వేసి ఉన్న తాళాలు గుర్తించి, 290 గ్రాముల బంగారం, కిలో వెండి, కొంత నగదు దొంగిలించగా వారి నుంచి 231 గ్రాముల బంగారం, కిలో వెండి రికవరీ చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో పాత నేరస్తుడైన కర్రి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులను లాకర్‌లో భద్రపరచుకోవాలని, ఎల్‌హెచ్ఎంఎస్ ఉచిత పోలీసు సర్వీసును ఉపయోగించుకుని నేరాలు జరగకుండా చూడాలని తెలిపారు. నిందితునులను పట్టుకుని చోరీ సొత్తు రికవరీకి ప్రత్యేక కృషి చేసిన కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ దేవరాజ్ మనీష్ పాటిల్, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, కాకినాడ పోర్ట్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్, కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ చైతన్య, క్రైం ఎస్ఐ బి.వినయ్‌ప్రతాప్, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు, పోర్ట్ ఎస్ఐ నరేంద్ర సతీష్‌బాబు, ఏఎస్ఐలు కె.గోవిందరావు, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు కె.ఎస్.వర్మ, జి.నరసింగరావు, పీఎల్‌వీవీఎస్ ప్రసాద్, బంగార్రాజు, ఆంజనేయ స్వామి, కె.వెంకటరత్నాన్ని అభినందించారు.

చోరీలు చేసి.. చలిమంట వేసి!

పట్టుబడ్డ ఇద్దరు దొంగలు

పరారీలో మరొకరు

చింతూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చోరీలు చేసిన దొంగలు చలిమంట కాగుతూ గ్రామస్థుల చేతికి చిక్కారు. వివరాలివి.. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం రాత్రి అటవీ అధికారికి చెందిన ద్విచక్రవాహనం (బుల్లెట్) చోరీకి గురైంది. ఆ వాహనాన్ని చోరీ చేసిన ముగ్గురు అదేరోజు రాత్రి మోతుగూడెనికి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాటుకపల్లిలో చిన్నపాటి దుకాణాల్లో వస్తువులను చోరీ చేశారు. కాగా రాత్రి చలితీవ్రత అధికంగా ఉండడంతో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ తాటాకింటి సమీపంలో వాహనాన్ని ఆపి ఇంటి పైకప్పు నుంచి తాటాకులు తీసి చలిమంట వేశారు. చలి కాగే సమయంలో ఓ వ్యక్తి కంట ముగ్గురు దొంగలు పడ్డారు. వెంటనే అతడు చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారిని వెంబడించారు. ద్విచక్ర వాహనంతో పాటు ఇద్దరు దొంగలు గ్రామస్థుల చేతికి చిక్కగా, మరో వ్యక్తి పరారయ్యాడు. శనివారం చింతూరు పోలీసుస్టేషన్లో వారిని అప్పగించారు. వీరు ఏలూరు జిల్లా వాసులని తెలిసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


కె.గంగవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలాంతరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలాంతరం గ్రామానికి చెందిన పంపన భాస్కరరావు (72) , విత్తనాల శివప్రసాద్‌తో కలిసి ఎర్రపోతవరం నుంచి బైక్‌పై బాలాంతరం వెళ్తున్నారు. ఈ సమయంలో ద్రాక్షారామ వైపు నుంచి యానాం వెళ్తున్న లారీ వీరు వెళ్తున్న మోటారు బైక్‌ను వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందగా, శివ ప్రసాద్‌కు గాయాలయ్యాయి. భాస్కరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వై.రామవరం: కొంతమూరు బ్రిడ్జి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రామవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దేవరమడుగుల ఫీడర్‌కు చెందిన లైన్‌మెన్ పత్రి ప్రభాకర్ (34)మృతిచెందాడు. ఈయనది మారేడుమిల్లి మండలం నర్సాపురం. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. తోటి ఉద్యోగి మృతితో సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏఈ కె.అబ్బాయిదొర, లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, సిబ్బంది సంతాపం తెలిపారు.

గండి పోశమ్మ ఆలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గొందూరులో వెలసిన స్వయంభూ శ్రీ గండి పోశమ్మ వారి ఆలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, దీంతో ఎవరినీ అనుమతించమని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్‌గా రామారావు ఏకగ్రీవం



వైడి రామారావు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ జిల్లా శాఖ చైర్మన్ వైడి రామారావు రాష్ట్ర శాఖ చైర్మన్‌గా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. దీంతో రామారావు తదుపరి మూడు సంవత్సరాల పదవీ కాలానికి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2025 జనవరి 29వ తేదీన అప్పటి చైర్మన్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీలో రామారావు బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కాకినాడ

లక్ష రుద్రాక్షల పూజ

తాళ్లరేవు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు కేశవపురంలో శ్రీభద్రకాళీ వీరేశ్వరస్వామి దేవాలయంలో అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్షల పూజ, లక్షపత్రి పూజలు నిర్వహించారు. ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పీటలపై కూర్చున్న జంటలతో పండితులు మర్ల మణిశర్మ, కొండవీటి శివరామకృష్ణ పూజలు చేయించారు. వన భోజనాలు నిర్వహించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న రామ్మోహన్‌రావు

కలెక్టరేట్ పరిపాలనాధికారి

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కాకినాడ కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ప్రధానంగా వ్యక్తిగత, సమాజ పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఉండవన్నారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కూడా పరిరక్షించుకోవచ్చని సూచించారు. ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వికాస పీడీ లచ్చారావు, కలెక్టరేట్ అధికారిణి సంధ్య, కలెక్టరేట్‌లో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ఆరోగ్యానికి పునాది

జేఎన్టీయూకే, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత అనేది ఆరోగ్యానికి పునాది అని, ప్రతీ వ్యక్తి తన ఇంటి నుంచి తన పరిసరాల వరకూ పరిశుభ్రతను ప్రారంభించాల్సిన అవసరం ఉందని డాక్టర్ డీవీవీ సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్సిటీ, యూసీఈకేలోని విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సమాజ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గంగనాపల్లిలో...

కాకినాడ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గంగనాపల్లిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పంచాయితీ కార్యదర్శి కర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీడీవో వి.వాసుదేవరావు, ఎంపీడీవో పి.సతీష్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీరామాంజనేయులు పాల్గొని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగదొడ్ల పరిశుభ్రత, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుట, పిల్లల చేతులను పరిశుభ్రం చేయించ డం, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

పుస్తక పఠనం పెంపొందించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

గ్రంథాలయ వారోత్సవాలు



కాకినాడ సిటీ: పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో, పెద్దాపురంలో తిలకిస్తున్న డీవైఈవో

కాకినాడ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పుస్తక పఠన సంస్కృతిని పెంపొందించడానికి ప్రతి ఒకరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం పుస్తక ప్రదర్శనను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, జిల్లా అసిస్టెంట్ ఆడిట్ అధికారి జి.సత్యనారాయణ, అడిట్ ఆఫీసర్ ఆతుల్లా ప్రారంభించి తిలకించారు. విద్యార్థులకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, వందేమాతరం నినాదం-మ స్వాతంత్ర్య సమరానికి ఊపిరినిచ్చిన స్ఫూర్తి అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు, ఉపాధ్యాయులు కేసరి శ్రీనివాసరావు, బి.సూర్యనారాయణ, ఉప గ్రంథాలయ ఇన్‌చార్జి కె.కిషోర్, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవడం ద్వారా జ్ఞాన సముపార్జనకు సరైన పునాది వేసుకోవచ్చని పెద్దాపురం డీవైఈవో ఈరంకి ప్రభాకరశర్మ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. డీవైఈవో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పుస్తక పఠనం మంచి అలవాటని, చిన్నతనం నుంచే పఠనాసక్తిపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, మహాత్మగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పెంకే పద్మశ్రీ, గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, సుమ, శైలజ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, పాఠకులు ఉన్నారు.

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో భారీ పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అపెక్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.ఏ.బేగ్ మాట్లాడారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు సత్యనారాయణ, హిందీ ఉపాధ్యాయులు ప్రసాద్, లైబ్రేరియన్ అంబటి వెంకటరమణ, పాఠకులు వర్మ, హుస్సేన్ ఉన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తకపఠనం చేయడం ద్వారా అపారవిజ్ఞానాన్ని పొందవచ్చని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య పేర్కొన్నారు. సామర్లకోట గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకపఠనం ప్రారంభించారు. గ్రంథాలయాధికారిణి బందిల రత్నమణి ఆధ్వర్యంలో సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేశారు. యార్లగడ్డ రాజేష్, పెద్దిరాజు,కొమ్ము శివశంకరప్రసాద్ పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురం శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన చేసి విద్యార్థులకు వివరించారు. లైబ్రేరియన్ వెంకట రాము మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు పుస్తక పఠనం పై దృష్టి సారించాలన్నారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాడా విజన్ ప్లాన్ అధికారి చుక్కా శివ దారి సాయి, టీబీఎస్ ఉపాధ్యాయుడు రాంబాబు, విద్యార్థులు ఉన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ కొత్తపల్లి శాఖాగ్రంథాయాల్లో పుస్తకప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు తుమ్మలపల్లి జయకృష్ణ, తెలగంశెట్టి నళినీ ప్రియ మాట్లాడతూ విద్యార్థులు పుస్తకపఠనం అలవర్చుకోవాలన్నారు.

నేడు గొల్లప్రోలు నుంచి అన్నవరం మహా పాదయాత్ర

గొల్లప్రోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని విజయదుర్గమ్మ ఆలయం నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం వరకూ ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. ఏటా కార్తీకమాసంలో నిర్వహించే ఈ పాదయాత్రకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పా ల్గొనే భక్తులకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు చేబ్రోలు శివారులో అల్పాహారం ఏర్పాటు చేయగా, అన్నవరంలో సాయి ప్రియ సేవాసమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ భోజనాలు ఏర్పాటు చేయనున్నారు. పాదయాత్రగా వెళ్లిన భక్తులు తిరిగి వచ్చేందుకు వాహనాలు ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొని స్వామి,అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కమిటీ ప్రతినిధులు గొల్లపల్లి గంగాధరరావు, మామిడాల సూరిబాబు, అక్కిరెడ్డి శ్రీనివాస్, గొల్లపల్లి చినకొండలరావు, కీర్తి వెంకటరమణ, కూరాకుల చంద్రరావు కోరారు.

నేడు గొల్లప్రోలులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

గొల్లప్రోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మొగలి నరసింహమూర్తి, రఘు(యూఎస్ఏ) ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరిగే ఈ శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలు జరుపుతారు. అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారు. గొల్లప్రోలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశం వినియోగించుకోవాలని మొగలి నరసింహమూర్తి కోరారు.

'పీఆర్‌లో' స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కాకినాడ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వుల మేరకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 17 నుంచి 20 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు తెలిపారు. కోర్సుల ఖాళీల వివరాలను www.prgc.edu.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు. వివరాలకు కళాశాల అడ్మిషన్స్ సమన్వయకర్త కె.లక్ష్మణరావును9440026354లో సంప్రదించాలన్నారు.

షష్ఠి ఉత్సవాలకు పందిరి రాట

పెద్దాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చదలాడ గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం శనివారం నిర్వహించారు. ఈనెల 22 నుంచి 26 వరకు ఉత్సవాలు జరుగుతాయి. కోడిగుడ్డు త్రిమూర్తులు, తాడాల ఏసుబాబు, వెంకట సురేష్, వీరబాబు, సీతారామయ్య పాల్గొన్నారు.

ముగిసిన గౌరీదేవి ఉత్సవాలు

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కట్టమూరు గ్రామంలో ఆశ్వయుజ శుద్ధ తదియ నుంచి ప్రారంభమైన గౌరీదేవి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గౌరీ శివపార్వతులకు ఘన వీడ్కోలు పలికి అనంతరం ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

సర్పవరం జంక్షన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి, నారాయణ సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు అడబాల రత్నప్రసాదరావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పి.ధర్మచంద్ర రాజు తదితరులున్నారు.



దుర్గాడలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

జడ్పీ సీఈవో లక్ష్మణరావు


పారిశుధ్య పరిస్థితిని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

గొల్లప్రోలు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లాపరిషత్ సీఈవో లక్ష్మణరావు వెల్లడించారు. దుర్గాడలో అధ్వాన పారిశుధ్యంపై ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ఆదేశాలతో రోడ్ల పక్కన ఉన్న చెత్తాచెదారాన్ని ఎంపీడీవో సెలట్‌రాజు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది తొలగించారు. గ్రామంలో పరిస్థితిని సీఈవో పరిశీలించి వీధుల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య సిబ్బంది కొరత ఉందని సీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీడీవో సెలట్‌రాజు, డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్, జనసేన నాయకులు ఉన్నారు.

'సర్' విజయవంతానికి సహకారమందించాలి

సర్పవరం జంక్షన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పారదర్శక ఓటరు జాబితాల రూపకల్పనకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్.మల్లిబాబు కోరారు. శనివారం సర్పవరం జంక్షన్‌లో తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అవగాహన నిర్వహించారు. ఓటరు జాబి తాల్లో ఉన్న నకిలీ ఓట్లు, చనిపోయిన ఓటర్లు, ఒకటి కంటే అదనంగా ఉన్న ఓట్లు తదితర లోపాలు ఉంటే గుర్తించి, పారదర్శక ఓటరు జాబితాలు తయారు చేసేందుకు బీఎల్వోలకు సహకారం అందించాల న్నారు. బీఎల్వోలు లేని చోట వీరిని తక్షణమే నియమించాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్లు కేఎల్ సురేష్‌కుమార్, కల్యాణ్ చక్రవర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు సాయిబాబు,ఆర్ వెంకటేశ్వరరావు, డి.గణేష్, ఎస్.అప్పారావు, కేవీ లింగరామయ్య, అజయ్, రాజా తదితరులు ఉన్నారు.

20న కలెక్టరేట్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలి

పిఠాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వెల్ఫేర్ బోర్డును పునర్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. రామా థియేటర్ సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఎన్నికల ము ందు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా రావాల్సిన సంక్షేమ బకాయిలు చెల్లిస్తామని, వారిని అన్ని విధాల ఆదుకుంటామని కూటమి నేతలు హామీ ఇచ్చారని వాటిని నెరవేర్చాలని తాము కోరుతున్నామన్నారు. సీఐటీయూ కన్వీనర్ కుంచే చిన్నా, సంఘం అధ్యక్షుడు పప్పుల వీరబాబు, డిసత్యనారాయణ, మోరుకుర్తి సూరిబాబు, దంట్ల నాగేశ్వరరావు, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కౌశిక్‌వర్ధన్ ప్రతిభ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఈత పోటీలు విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో ఉన్న ఆక్వాటిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగాయి. కాకినాడకు చెందిన పెసింగి కౌశిక్‌వర్ధన్ అండర్ 14 విభాగంలో 50మీటర్లు, 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌ల్లో ద్వితీయ స్థానాలు, 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో తృతీయస్థానం సాధించాడు. పోటీల్లో విజయం సాధించిన వారు ఈ నెల చివరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారు. కౌశిక్‌వర్ధన్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, విశాఖ జిల్లా పీడీ సతీష్, ఉమ్మడి ది తూర్పు గోదావరి జిల్లా టీం మేనేజర్ బి.సురేష్ రాజు, కోచ్ జి.దుర్గాదేవి, పీడీలు అభినందించారు.


డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడితో కౌశిక్‌వర్ధన్

బాలల హక్కులపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ లైన్ 1098 సంయుక్తంగా కాకినాడ నుంచి సామర్లకోట వరకు రైలులో ప్రయాణికులకు బాలల హక్కులు, భద్రతపై శనివారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీవో ఎన్ఐసీ విజయ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, శిశుగృహ మేనేజర్ రేవతి, కౌన్సిలర్ దుర్గారాణి, సోషల్ వర్కర్ చినబాబు, కేసు వర్కర్ లక్ష్మి, నర్సదేవి, ఓఆర్ డబ్ల్యు భవాని పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు

పిఠాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బి.ప్రత్తిపాడు మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థినులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ రెస్పాన్సిబులిటీ కార్యక్రమంలో భాగంగా 16 సైకిళ్లు అందజేశారు. హెచ్ఎం మండపాక ప్రభాకరరావు, విద్యాకమిటీ చైర్మన్ దుర్గాప్రసాద్, సర్పంచ్ ఊటా రామకృష్ణ, తుని ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు తదితరులు ఉన్నారు.




కాకినాడలో ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

అమరవీరుల ఆశయాల సాధనకు కృషి

ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కాకినాడ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాల సాధనకు కృషి చేద్దామని, వారి పోరాట స్ఫూర్తితో నియంతృత్వ, దోపిడి పాలనకు వ్యతిరేకంగా పోరాడుదామని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాట ఉద్యమ నిర్మాత చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక యూటీఎఫ్ భవనం సమావేశ హాలులో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్టీయూ, ప్రగతి శీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి), పీడీఎస్‌యూ (విద్యార్థి) ప్రజా సంఘాల ఉమ్మడి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అధ్యక్షత వహించారు. ముందుగా బాలాజీచెరువు సెంటర్ వద్ద నుంచి జడ్పీ సెంటర్,ఇంద్రపాలెం వంతెన వరకు ఎర్రజెండాలతో ప్రదర్శన జరిపారు. అనంతరం సభలో ముఖ్య వక్తగా వీరాంజనేయులు మాట్లాడుతూ దోపిడి, పీడన, అసమానతలు, వివక్షతలేని సమాజ నిర్మాణం కోసం పోరాడుతూ అనేక మంది అశువుల బాసారని, వారి త్యాగాలె ఎనలేనివన్నారు. తొలుత అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి మౌనం పాటించారు. సభలో ఏఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు మడకి సత్యం, ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు రెడ్డి దుర్గాదేవి, చింతపల్లి రత్నం, మహాలక్ష్మి తదితరులున్నారు.

'34 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి'

కాకినాడ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం ప్రకారం స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని, బీసీ రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని అధిగమించేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ కోరారు. కాకినాడలోని సంఘ జిల్లా కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జనగణనలో బీసీ కులగణన జరిగేలా సత్వర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నే నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు బడే వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శివాజీ, కార్యదర్శులు దారపు శిరీష, మాలతి, డి.చిన్న, గంగాధర్, బాబ్జి పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలుకు చర్యలు

మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. శనివారం పిఠాపురం మండలం పి.తిమ్మాపురం గ్రామంలో రైతులు రండించిన ధాన్యం విక్రయం చేస్తున్న రైతులతో వర్మ మాట్లాడారు. మద్దతు ధర కంటే తక్కువకు అమ్మవద్దని, ఎవరైనా ఇబ్బందులు పెడితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభ మయ్యాయని తెలిపారు. మద్దతు ధర అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారం రోజుల్లోనే రైతుల ఖాతా సొమ్ములు జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ బర్ల అప్పారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ ఉన్నారు.

'సహకార వ్యవస్థ బలపేతంతోనే మనుగడ'

పిఠాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థ బలోపేతంతోనే మానవళి మనుగడ ఆధారపడి ఉందని మాజీ ఎమ్మెల్యే, ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు మాజీ ఛైర్మన్ మానం ఆంజనేయులు తెలిపారు. శనివారం పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయంలో సహకార జాతీయ వారోత్సవాల్లో భాగంగా సహకార సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఈ వ్యవస్థ ప్రాధాన్యతను విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. దాంతో ప్రధాన సమస్యలైన పేదరికం, ఆకలి, అసమానతలు, పర్యావరణ పరిరక్షణ వంటి సవాళ్లను ఎదుర్కొవడానికి సహకార రంగం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప


సదస్సులో ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ప్రారంభమైన సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం పాల్గొన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి వివిధ పారిశ్రామిక వేత్తలతో సీఐఐ సమావేశం నిర్వహించడం ద్వారా పారిశ్రామిక వేత్తలను మన రాష్ట్రానికి వచ్చేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాజప్పతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కళావెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ చైతన్య రాజు తదితరులు ఉన్నారు.

పైడితల్లి విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామా థియేటర్ సెంటర్‌లోని పైడితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వర్మ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. కమిటీ సభ్యులు దొరబాబును సత్కరించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో గణపతి పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ దంపతులు కొత్తపల్లి పద్మ, బుజ్జి ఆధ్వర్యంలో జరిగింది. శెట్టిబలిజ యూత్ ఆనంద భూపతి వీర వెంకట రమణ, చింతాకుల దుర్గాప్రసాద్, సతీష్, వనం ఏసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్లు నరికివేత

కొత్తపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మూలపేటలో పంచాయతీ వాటర్‌ట్యాంక్ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న పచ్చని చెట్లను అక్రమంగా నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. పంచాయతీకి చెందిన చెట్లను అనుమతి లేకుండా నరకడం నేరమని ప్రశ్నించినా ఎటువంటి సమాధానం చెప్పకుండా ట్రాక్టర్‌పై చెట్లను తరలించుకునిపోయారని ప్రజలు చెప్తున్నారు. చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'సగరుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తా'

గొల్లప్రోలు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సగరుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని రాష్ట్ర సగర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలి అప్పారావు తెలిపారు. డైరెక్టర్‌గా నియమితులైన అప్పారావును శనివారం చినజగ్గంపేట గ్రామస్తులు, పెద్దలు, మహిళలు కలిసి సత్కరించారు. సగర సమాజ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. తనను నమ్మి గురుబాధ్యత అప్పగించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

కార్తీక ఏకాదశి పూజలు


పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం ఏకాదశి కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమై రాత్రి వరకూ కొనసాగింది. పాదగయ నషుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కుక్కుటేశునికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. ఏకాదశి ఉపవాసం ఉన్న భక్తులు సాయంత్రం ఆలయానికి వచ్చి తులసి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. నందీశ్వరుడు, శివలింగాలకు జలాభిషేకం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామర్లకోట, (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయం శనివారం తెల్లవారుజాము నుంచీ భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తలమండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) తదితర ధర్మకర్తలమండలి సభ్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున గోపూజలతో పూజలను ప్రారంభించారు. భీమేశ్వరస్వామికి విశేష అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు పదివేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రూ.3,84,663 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

రేపు వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు సోమవారం కాకినాడ వికాసలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, కౌంటర్ క్యాషీయర్, ఫైథాన్ ఫుల్‌స్టాక్, సైబర్ సెక్యూరిటీ, ఏరియా సేల్స్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్, టెలికాలింగ్ ఎగ్జిక్యూటివ్, సర్వే ఎగ్జిక్యూటివ్, క్లయింట్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, టెలిసేల్స్ రిప్రజెంటేటివ్, సర్వే ఎగ్జిక్యూటివ్, నెట్ వర్క్ ఇంజనీర్, డెస్క్‌టాప్ ఇంజనీర్, ఎల్1 సపోర్ట్, డేటా సెంటర్ ఆపరేటర్, టెక్నీషియన్, మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగనున్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బిటెక్, ఎంటెక్ ఉత్తీర్ణులైన 40 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యల్లమిల్లి గ్రామానికి చెందిన మామిడిపాక కల్యాణ్ సాగర్(24) ఈనెల 12న కె.నాయకంపల్లి నుంచి యల్లమిల్లి వెళుతున్న పాలవ్యాన్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు ఉదయం మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. దీనిపై హెడ్ కానిస్టేబుల్ సలీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఘనంగా బిర్సా ముండా జయంతి


బిర్సా చిత్ర పటానికి నివాళులర్పించిన జొజ్జిరెడ్డి

రంపచోడవరం, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో శనివారం బిర్సా ముండా 150వ జయంతిని ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి, సభ్యురాలు గొర్లె సునీత, ఆర్డీవో పి.అంబేద్కర్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకట లక్ష్మి, మైనార్టీ బోర్డ్ డైరక్టర్ షేక్ సుభాని బిర్సా ముండా చిత్ర పటానికి పూల బమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశంకోసం పోరాడిన ద్వారబంధాలచంద్రయ్య నాల్గవతరం వారసులైన ద్వారబంధాల సత్యనారాయణ, నాగదుర్గస్వామి, అబ్బులు, అబ్బాయి, నాగమణి, సూర్య చత్రపతి, సాయిలను దుచ్చాలువాలతో సత్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత వివిధ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు, డీఎల్డీవో కోటేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో చరిత, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, తహశీల్దారు బాలాజీ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆదివాసీ హక్కులు, పరిరక్షణ కోసం ఉద్యమించిన బిర్సా ముండా జయంతిని శనివారం స్థానిక మార్క్స్-ఏంగిల్స్ భవనంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐకే ఎంఎస్ నాయకులు కుంజా దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి, పల్లాల అశోక్, కె.బాలుదొర, కె.బాలురెడ్డి, ఐ.వీ.రమణ, పి.అనసూయ, ఎం.లింగారెడ్డి, ఎం.సురేష్, పి.ధర్మారెడ్డి, పి.సుగ్గిరెడ్డి, కె.మూర్తిరెడ్డి, ఎస్.చిలకమ్మ, సర్పంచ్‌లు పి.ఆదిలక్ష్మి, అన్నిక పండమ్మ పాల్గొన్నారు.

చింతూరు,(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ పోరాటయోధుడు బిర్సాముండా 150వ జయంతి వేడుకలు చింతూరు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఐటీడీఏ, పాఠశాలలు, ఆదివాసీ సంఘాలు జరుపుకున్న కార్యక్రమాల్లో వక్తలు, విద్యార్థులు బిర్సాముండా వీరోచిత పోరాటాలను గుర్తు చేసుకు న్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన బిర్సాముండా జయంతి వేడుకల్లో భాగంగా ఐటీడీఏ ఏపీవో రామతులసి తదితర అధికారులు బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఆదివాసీ కళా నృత్యాలను అలరించారు. అధికారులు మొక్కలు నాటారు. తదుపరి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఓ రాజకుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌దొర, ఐటీడీఏ సీఎంఓ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవారం పంచాయతీ పోతవరం రైతు భరోసా కేంద్రంలో ఆది వాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, జన జాతీయగౌరవ దివస్ సందర్భంగా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుర్రం జగదీష్ కార్యదర్శి మణికంత, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, చవలం విద్యాసాగర్, కారం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ని రేఖపల్లి కస్తూరీబా గాంధీ గురుకుల పాఠశాలలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో ఆయన చిత్ర పటానికి గిరిజన సంఘాధ్యక్షుడు కారం సుందరయ్య, మండల కార్యదర్శి పూనెం ప్రదీప్‌కుమార్ ఎంపీపీ కారం లక్ష్మి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కారం సత్తిబాబు, గొర్రె రాజు, పండా వెంకటేశ్వర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


వెండి నాగాభరణం అందజేస్తున్న దేవుడు దారాలమ్మ కుటుంబ సభ్యులు

మోతుగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామంలో శ్రీ దుర్గామల్లేశ్వర ఆలయంలో శనివారం ఏకాదశి కావడంతో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం 10 గంటలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు. అనంతరం శివయ్యకు పంచా మృతా లతో అభిషేకాలు నిర్వహించి గంధం, విభూతి, పసుపు, కుం కుమలతో అభిషేకించారు. అనంతరం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారికి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం జ్యోతిర్లింగార్చన దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ సతీష్ రాఘవన్, కార్యదర్శి ఎం.శివరామకృష్ణ, ట్రెజరర్ వేపకాయల శ్రీను, మెంబర్స్ గోవిందరాజు, నాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు

పుస్తక పఠనంతో ఉన్నతావకాశాలు

వై.రామవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని లైబ్రేరియన్ సత్యవతి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

రాజవొమ్మంగి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండలంలో అధికారులు శనివారం స్వర్ణంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లో పాఠశాలల వద్దకు వెళ్లి విద్యార్థులకు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఎంపీడీవో యాదగిరేశ్వరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యలయ అవరణలో సిబ్బంది పరిసరాలు పరిశుభ్రం చేశారు.

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో లోయర్ సీలేరు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో శనివారం స్వ చ్ఛ ఆంధ్ర స్వర్ణఆంధ్ర కార్యక్రమం చీఫ్ ఇంజనీర్ చిన కామే శ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సామూహిక పరిశుభ్రత పాటించడానికి, పరిసరాలు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులచే ప్రతిజ్ఞచేయించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలకృష్ణ, వరప్రసాద్, జేఏవో కిరణ్, ఉద్యోగులు, కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల ప్రారంభోత్సవం

రంపచోడవరం, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగెద్దాడలో నూతనంగా నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడె న్షియల్ పాఠశాలలను శనివారం ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ ప్రారంభోత్సవం చేశారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 40 ఏకలవ్య పాఠశాలలను వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీపీ బంధం శ్రీదేవి, సర్పంచ్ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారులు, ఏకలవ్య పాఠశాలల ప్రధానోపాధ్యా యులు పాల్గొన్నారు.

'మమ్మల్ని తెలంగాణలో కలపండి'

ఎటపాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన, విలీనంతో ఎన్నో ఇబ్బందులు, కష్టాలు పడుతున్నామని, ప్ర స్తుతం ఏపీలో ఉన్న ఎటపాక మండలంను తిరిగి తెలంగా ణలో విలీనం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈమే రకు శనివారం తెలంగాణలోని హన్మకొండలో మహబూబాద్ మాజీ ఎంపీ, బీజేపీ ఇంచార్జ్ అజ్మీర సీతారాంనాయక్‌కు వినతి పత్రంను అంధజేశారు. గతంలో భద్రాచలం రూరల్ ప్రాం తంగా ఉన్న తమను ఆంధ్రాలో విలీనం చేశారని, దీంతో పరి పాలనాపరంగా జిల్లా కేంద్రంకు వెళ్లాలంటే వందల కిలోమీ టర్లు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, విద్యావైద్యంకు తెలంగాణపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. పోలవరం ముంపు జాబితాలో 41.15 కాంటూరు పరిధిలో ఎటపాక మండలం లేనందున తిరిగి తమను తెల ంగాణలో కలపాలని కోరారు. ఈ అంశంను బీజేపీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎంపీ సీతారాంనాయక్ హామీ ఇచ్చినట్లు అఖిలపక్ష నాయకులు పూసం రాఘవయ్య, తాని కొండ వాసు, గొల్లపల్లి శివబాబు, మూడే సతీష్‌కుమార్, అపకా రాంబాబు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం పదిలం


తొండంగిలో జరిగిన స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు. శనివారం రావికంపాడు గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే ముచ్చటించారు. అనంతరం గ్రామంలో నిర్మించనున్న పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. ప్రభుత్వ అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, ఆత్మ చైర్మన్ నరహరిశెట్టి సూర్య ప్రకాష్, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, ఎంపీడీవో సాయినవీన్, తహశీల్దార్ కాంతారావు, గ్రామ కార్యదర్శి రామారావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

తుని ఎమ్మెల్యే యనమల దివ్య

పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన

ఏలేశ్వరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని లింగంపర్తి అధ్యక్షుడు పెంటకోట మోహన్ సూచించారు. శనివారం లింగంపర్తిలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆరోగ్యవంతమైన వాతావరణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని రెవెన్యూ ఉద్యోగులు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం.సూర్యప్రభ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన బస్టాండ్, కళామందిర్ సెంటర్‌ల మీదుగా అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు కొనసాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలపట్ల శుభ్రత పాటించాలన్నారు. మెయిన్ రోడ్డు వెంబడి దుకాణ యజమానులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, ఆర్ఐ అవసరాల గోపాలకృష్ణ, మండల సర్వేయర్ బషీర్, సీనియర్ అసిస్టెంట్ సాయివర్మ, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల వద్ద శనివారం అధికారులు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర నిర్వహించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేసి ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో నాయక్, సీనియర్ అసిస్టెంట్ లలిత, కార్యదర్శి ఫణీంద్రకుమార్, టీపీ శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్బారావు

విద్యార్థులు సృజనాత్మకతను కలిగి ఉండాలి

ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ వీఎంవీ సుబ్బారావు

తుని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకత దృక్పథాన్ని కలిగి ఉండాలని ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ వీఎంవీ సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన శ్రీప్రకాష్ విద్యాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా దీని అనుబంధ సంస్థ అయిన స్పేసేస్ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సాహం, నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కంటిపూడి నరేంద్ర బాబు, ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు ఉన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారందరికీ పదవులు


పదవులు పొందిన వారితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో శనివారం జగ్గంపేట నియోజకవర్గ మండల, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల సభ్యులు 2632 మంది ప్రమాణ స్వీకారోత్సవం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగింది. దీనికి ఎమ్మెల్సీ రాజశేఖర్, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గండేపల్లి మండలాధ్యక్షుడిగా పోతుల మోహనరావు, జగ్గంపేట మండలాధ్యక్షుడిగా జీను మణిబాబు, కిర్లంపూడి అధ్యక్షుడిగా వీరంశెట్టి కాశీబాబు, గోకవరం మండలాధ్యక్షుడి పి.చంటిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ముం దుగా టీడీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నెహ్రూ తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, ఏఎంసీ చైర్మన్ అడపా భరత్, కొత్త కొండబాబు, బి.వీరబాబు, అడబాల భాస్కరరావు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, పాలచర్ల నాగేంద్రచౌదరి, డి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడు సబ్ జైల్‌లోని రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి గోపినాథ్

సబ్ జైలును సందర్శించిన జడ్జి

ప్రత్తిపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్ జైలును స్థానిక జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎల్.గోపినాథ్ సందర్శించారు. సబ్‌జైలులోని ఖైదీలకు అందుతున్న వసతి సౌకర్యాలతో పాటు ఆహార నాణ్యత అంశాలను పరిశీలించారు. సబ్ జైలు రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ ఎలా సహాయ పడుతుందనే విషయాలను వివరించారు. వంటశాలతో పాటు ఖైదీల గదులను తనిఖీ చేశారు. ఫిర్యాదుల పెట్టెను తెరిపించి ఫిర్యాదులు లేకపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ బుగతా వెంకట శివన్నారాయణ, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.


ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న యనమల

తుని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గాన్ని

ఏకాభిప్రాయంతో ఎన్నుకోవాలి


తుని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్తకుల సమస్యలు భుజాన వేసుకుని బాధ్యతతో పనిచేసే కార్యవర్గాన్ని ఏకాభిప్రాయంతో ఎన్నిక చేయాలని మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు తెలిపారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో పట్టణానికి చెందిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో యనమల సమావేశమయ్యారు. పట్టణంలో అరాచకాలు లేని వాతావరణం నెలకొందని, రౌడీయిజాన్ని తరిమికొట్టేందుకు పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మోతుకూరి వెంకటేష్, మాజీ ఛాంబర్ అధ్యక్షులు పెనుగొండ కామరాజు, యినిగంటి సత్యనారాయణ, సూరంపూడి చంద్రశేఖర్, నార్ల రత్నాజీ, పీవీసీ గుప్తా, తటపర్తి రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకుని సహాయం చేయాలి



గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదుకుని తమకు సహాయం చేయాలని వడ్లమూరి నాగేంద్ర కుటుంబీకులు వేడుకుంటున్నారు. రామేశ్వరంపేట పవర్ గ్రిడ్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై సూరంపాలెంకు చెందిన నాగేంద్రతో పాటు మానస్ పండా గాయపడ్డారు. అప్పట్లో నాగేంద్రను కాకినాడలోకి ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, కుడికాలు తొలగించారన్నారు. పేద కుటుంబానికి చెందిన నాగేంద్రకు తల్లిదండ్రులతో పాటు ఒక అక్క ఉన్నారు. ఇతని తండ్రి ఒక సైకిల్ షాపు నిర్వహిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నారు. ఇటీవల పవర్ గ్రిడ్‌లో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ ఘటనతో ఆసరాగా ఉండే కొడుకు అవిటి వాడు కావడంతో ప్రభుత్వం ఆదుకుని మెరుగైన వైద్యం అందేలా చూడాలని బాధితుడు కోరుతున్నారు.

సునీల్‌కు జనసేన నాయకుల పరామర్శ


చలమలశెట్టి సురేంద్రనాథ్‌కి నివాళులర్పించిన తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెం ట్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ప్రముఖ వ్యాపారవేత్త చలమల శెట్టి సునీల్ తండ్రి చలమలశెట్టి సురేంద్రనాథ్ ఇటీవల స్వర్గస్తులైనారు. శనివారం మచిలీపట్నంలో వారి స్వగృహంలో నిర్వహించిన సురేంద్రనాథ్ దశదినకర్మ కార్యక్రమానికి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై వారి కుమారులు చలమలశెట్టి సునీల్, అనిల్, వెంకటేష్‌లను పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేంద్రనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మారిశెట్టి రాఘవయ్య, కరాటం రాంబాబు, మేడిబోయిన శ్రీను, మాదారపు వీరబాబు, దాడి చిన్న బుజ్జి, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

20 బ్లాక్ స్పాట్స్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం నుంచి జగ్గంపేట మీదుగా గండేపల్లి మండలం మురారి గ్రామం వరకు ఉన్న సుమారు 27.2 కిలోమీటర్ల మేర 16వ నెంబరు జాతీయరహదారిపై ఉన్న 20 బ్లాక్ స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని కాకినాడజిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్‌తో కలిసి ఈ బ్లాక్‌స్పాట్లను పరిశీలించారు. ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో తెలుసుకుని అక్కడ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో చర్చించారు. త్వరలో దీనిపై కార్యాచరణ చేస్తామని ఆయన పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు ప్రమాదాలు తగ్గడానికి అన్ని చర్యలు చేపడతామని ఎస్పీ శ్రీనివసరావు తెలిపారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి


గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మనీషా

శంఖవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పెదమల్లాపురం గ్రామంలో శనివారం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించా రు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా హాజరయ్యారు. దింసా నృత్యం ఆకట్టు కుంది. గిరిజనులతో కలిసి మనీషా నృత్యం చేశారు. స్టాల్స్‌ను పరిశీలిం చారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

తొండంగి,(ఆంధ్రజ్యోతి): గిరిజన పోరాట యోధుడు బిర్సా ముండా 150 జయంతి వేడుకలను శనివారం పెరుమాళ్ళపురంలో ఘనంగా నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. విద్యార్థులకు ఆయన జీవన విశేషాలను వివరించా రు. ప్రధానోపాధ్యాయులు చాట్రాటి సత్యన్నారాయణ స్వాతంత్ర్య పోరాటంలో ముండా పాత్రను వివరించి ఆయన స్ఫూర్తితో విద్యార్థులంతా దేశ సేవకు అంకితం కావాలన్నారు.

ఏలేశ్వరం ఏపీఎన్‌జీవో కార్యవర్గం ఎన్నిక

ఏలేశ్వరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండల యూనిట్ ఏపీఎన్‌జీవో నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎన్నికల అధికారి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో యూనిట్ అధ్యక్షుడిగా మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎంవీ రామరాజువర్మ, స్థానిక వీఆర్వో అవసరాల తిరుమలరావు (కిషోర్) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎస్.శేషురాజు (సీనియర్ అసిస్టెంట్ నగర పంచాయతీ), బి.శ్రీహరి యాదవ్ (సీనియర్ అసిస్టెంట్ ఇరి గేషన్), ఎస్.పొన్నాలు (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తహసీల్దార్ కార్యాలయం)లను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సీహెచ్ కిరణ్‌కుమార్ (సీని యర్ అసిస్టెంట్ ఎంపీడీవో), సహాయ కార్యదర్శులుగా బీజేకే బాలాజీ (సీనియర్ అసిస్టెంట్ ఇరిగేషన్),సీహెచ్ కుమార్ రాజు, (శానిటరీ ఇన్‌స్పెక్టర్ నగర పంచాయతీ), పి.సురేష్‌కుమార్. (జూనియర్ అసిస్టెంట్ ఎంపీడీవో), మహిళా జాయింట్ సెక్రటరీగా ఎస్.విజయలక్ష్మి (ఎంపీహెచ్ ఎస్) ట్రెజరర్ డాక్టర్ ఆర్ సత్యనారాయణ మూర్తి (డబ్ల్యూ ఈఏ పంచాయతీరాజ్)లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గూదేటి రామ్‌మోహన్, జిల్లా కార్యదర్శి పాలపర్తి మూర్తిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు నరేళ్ళ చంద్రరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి క్షేత్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శి వై.రామకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు.


ఈవోకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య దంపతులు

లోవ అభివృద్ధి పనులకు విరాళం

తుని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం ఆలయ ఈవో పి.విశ్వనాథ రాజుకు విరాళం చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లోవ దేవస్థానం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రత్తిపాడు ఆసుపత్రిలో ఏలూరు డీసీహెచ్‌ఎస్ విచారణ

ప్రత్తిపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం ఏలూరు జిల్లా ఏరియా ఆసుపత్రుల కోఆర్డినేటర్ పాల్ సతీష్ విచారణ చేపట్టారు. ఆసుపత్రి నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదులు, ప్రధాన వైద్యాధికారి సిబ్బంది మధ్య సమన్వయ లోపం తదితర అంశాలపై వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో ఈయన విచారణ చేపట్టారు. ఆసుపత్రిలోని వైద్యులను, సిబ్బందిని వేర్వేరుగా మాట్లాడి వారి వివరాలు నమోదు చేశారు. వీటి వివరాలను వెల్లడించేందుకు విచారణ అధికారి పాల్ సతీష్ నిరాకరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


మల్లేపల్లిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు

గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాల్గవ శనివారం కావడంతో మండలంలోని ఆయా గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు గోవింద నామస్మరణలతో మారుమోగాయి. తాళ్లూరు, మల్లేపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. మల్లేపల్లిలో ఆలయ అర్చకుడు నాగేశ్వర ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కె.చినవీరభద్రరావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రాచపల్లిలో ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాచపల్లిలోని అరుణాచల క్షేత్రంలో శనివారం కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ, పరమేశ్వర కల్యాణాన్ని జరిపారు. మృత్యుంజయ హోమంతో పాటు పూర్ణాహుతి నిర్వహించారు. అపీత కుచాంబ, అరుణాచలేశ్వరులకు పంచామృత అభిషేకాలు, పంచహారతులు చేపట్టారు. సాయంత్రం ఆకాశ దీపాలకు పూజలు నిర్వహించి పుష్కరిణి వద్ద గంగామాతకు గంగాహారతి ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామనంద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎన్జీవో కార్యవర్గం ఎన్నిక

ప్రత్తిపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తాలూకాఎన్జీవో నూతన కార్యవర్గ ఎన్నికను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసంఘ ఎన్నికను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా కార్యవర్గ పోస్టులకు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం తో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎంఎస్ సత్యనారాయణ, సెక్రటరీగా జె. రాజా, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ ఆస్కార్ ఆలీ, ఉపాధ్యక్షులుగా ఎం. శైలజారాణి, జె.శ్రీనివాస్, పీఎస్ రామకృష్ణలు, సంయుక్త కార్యదర్శులుగా ఏవీఆర్ సత్యనారాయణమూర్తి, కె.వీరభద్ర శ్రీనివాస్, ఆర్.మౌళి ప్రసాద్, మహిళా సంయుక్త కార్యదర్శిగా కె.పుష్పమికీర్తి, కోశాధికారిగా ఎంవీ సురేష్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవో పీవీవీ సత్యనారాయణ నిర్వహించారు.

ఓటరు జాబితా సవరణపై సమావేశం

ప్రత్తిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఓటర్ల జాబితాపై ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం. సూర్యప్రభ కొత్తపోలింగ్ కేంద్రాలకు బూత్‌స్థాయి అధికారుల నియామకం, పోలింగ్ కేంద్రాల హేతు బద్ధీకరణ తదితర అంశాలపై వివరించారు. కాంగ్రెస్ పార్టీ తరుపున డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు ధర్నాల కోట శ్రీను, సింగిలిదేవ్ సత్తిరాజు పాల్గొన్నారు.